క్లుప్తంగా

ఎంపీడీఓగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల అభివృద్ధి అధికారిగా శుక్రవారం అదిగొప్పల శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు గతంలో పొన్నూరులో ఎంపీడీఓగా విధులు నిర్వర్తించారు. శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టడంతో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఫిరంగిపురం కార్యదర్శిగా ఏకే బాబు



ఫిరంగిపురం: ఫిరంగిపురం పంచాయతీ గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శిగా అంకిరెడ్డి కిషోర్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మండలంలోని అమీనాబాద్ పంచాయతీ కార్యదర్శిగా ఆయన విధులు నిర్వహించారు. బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు.

పంచాయతీ కార్యదర్శి రమేష్‌కి సన్మానం



మేడికొండూరు: మండలం పరిధిలోని డోకిపర్రు గ్రావ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ ప్రస్తుతం ప్రభుత్వం బదిలీల్లో అమరావతి మండలం లేమల్లె గ్రామపంచాయతీకి కార్యదర్శిగా బదిలీ అవుతున్న బందెల రమేష్‌ని ఘనంగా సన్మానించారు. మేడికొండూరు మండల జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు గ్రామ సర్పంచి సామ్రాజ్యం, ఉపసర్పంచి జానీ సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది దివ్య, రిజ్వాన, ఉడత ప్రభాకర్ రావు, షేక్ నాగులు పాల్గొన్నారు.

నా భర్తది సహజ మరణం కాదు

తాడేపల్లిరూరల్: నా భర్తది సహజ మరణం కాదంటూ ఓ మహిళ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. తాడేపల్లి పోలీసులు కథనం.. చిట్టిపోతుల శివమల్లేశ్వరరావు(53) మండలంలోని పెనుమాకలో నివాసముంటూ తెనాలి ఆర్టీసీ డిపోలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలం కిందట భార్య చనిపోవడంతో పొన్నూరుకు చెందిన లీలావతిని రెండో వివాహం చేసుకున్నాడు. అనంతరం 2019లో తనభార్య చనిపోయిందంటూ విజయవాడకు చెందిన మేడ్చర్ల నాగమల్లేశ్వరిని వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి రెండవ భార్య కుటుంబ సభ్యులు, మూడో భార్య కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉంది. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. మూడో భార్యపై తెనాలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం శివమల్లేశ్వరరావు పెనుమాకలోని రెండో భార్య ఇంటికి వచ్చి మృతి చెందాడు. జరిగిన ఘటనపై మూడో భార్య అయిన నాగమల్లేశ్వరి తన భర్త మృతిపై తనకు అనుమానం ఉందంటూ శుక్రవారం తాడేపల్లి పోలీసులను ఆశ్రయించింది.

నిర్మల స్కూలులో దసరా సంబరాలు



మంగళగిరి: మండలంలోని నిర్మల ఇంగ్లిష్ మీడియం స్కూలులో శుక్రవారం దసరా సంబరాలు వైభవంగా నిర్వహించారు. దసరా సంబరాలలో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్‌జీఎఫ్ఐ అండర్–14 ఖోఖో జట్ల ఎంపికకు ఎన్నికైన విద్యార్థిని ఎం.సంజన మాధురికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్ఞాన సుందరి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

వారధి కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ



మంగళగిరి: రౌడీషీటర్లు, యువకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మురళీ కృష్ణ హెచ్చరించారు. ఇటీవల పట్టణంలోని రత్నాలచెరువులో శుక్రవారం రాత్రి డీఎస్పీ వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో చుట్టుపక్కల జరుగుతున్న నేరాలు, అసాంఘిక కార్యక్రమాలు, రోడ్డు ప్రమాదాల కారణంగా కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్, నిషేధిత ఉత్పత్తుల క్రయవిక్రయాలు, బాలికల అదృశ్యం వంటి అంశాలపై లఘు చిత్రాల రూపంలో ఏర్పాటు చేసిన వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ వినోద్‌కుమార్, పట్టణ ఎస్ఐలు నాయక్, మహేష్ పాల్గొన్నారు.



కంతరాజు కొండూరు శ్రీమహంకాళి అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనం



ఉండవల్లి రెడ్ల రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని గాయత్రీదేవి పూజలు అందుకుంటున్న దృశ్యం



తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి గాయత్రీదేవి అలంకారంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విజయకీలాద్రి పర్వతంపై అమ్మవారిని పల్లకిపై ఊరేగిస్తున్న అర్చకులు



పాతమంగళగిరి నృసింహస్వామి ఆలయంలో గజలక్ష్మీ అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



కోటిలింగాల ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



తాడికొండలో కనకదుర్గాదేవి అలంకారంలో అలంకరించిన అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దేవీ శరన్నవరాత్రులలో భాగంగా శుక్రవారం రెండో రోజు పలు అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారిని గాయత్రి దేవిగా. వీరలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తాడేపల్లి పట్టణ పరిధిలో త్రిదండి చినజీయర్‌స్వామి మంగళాశాసనాలతో విజయకీలాద్రి పర్వతంపై శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు వీరలక్ష్మి అలంకారం గావించారు.

–తాడేపల్లి రూరల్

దినదిన గండం ప్రయాణం...

అస్తవ్యస్తంగా రేవేంద్రపాడు-సీతానగరం రోడ్డు

- విజయవాడ వెళ్లాలంటే మూడు నియోజకవర్గా ప్రజలకు ఇక్కట్లు
- గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయింపు
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన నిర్మాణం
- తిరిగి పనులు ఎప్పుడా అని ఎదురు చూస్తున్న ప్రజలు

తాడేపల్లిరూరల్: రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో వెళ్తే నరకం కనిపిస్తోంది. ప్రాణాలు పణంగా పెట్టి ప్రయాణం చేయాల్సిందే. ఆ రోడ్డులో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఇంజనీరింగ్ కళాశాలకు వేలాది మంది విద్యార్థులు వెళ్లాల్సిన రోడ్డు. ఈ మార్గం గుంటూరు జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన ప్రయాణికులు విజయవాడ వెళ్లాలంటే ప్రధానంగా వినియోగించే రోడ్డు. గత 15 సంవత్సరాల నుంచి రోడ్డు నిర్మాణం లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, కొంతమంది ప్రాణాలు పోగొట్టుకుని, మరికొంత మంది అవయవాలు కోల్పోయి ప్రయాణాలు సాగించారు. రేవేంద్రపాడు బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి నుంచి ఉండవల్లి సెంటర్ స్క్రూ బిడ్జి వరకు 13 కిలోమీటర్లు దూరం ఉంది.



అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు మార్జిన్లు

గత ప్రభుత్వంలో నిధులు..

7 కి.మీ. సింగిల్ రోడ్‌ను డబుల్ రోడ్ చేసేందుకు గత ప్రభుత్వం ఏపీఎంసీఆర్‌సీఐపీ(ఆంధ్రప్రదేశ్ మండల కనెక్టివిటీ అండ్ రూరల్ కనెక్టివిటీ ఇంప్రూవ్‌మెంట్ (ప్రాజెక్ట్) కింద రూ.15.52 కోట్ల కేటాయించారు. రోడ్లు నిర్మించేందుకు రేవేంద్రపాడు, వడ్డేశ్వరం, కొలనుకొండ, కుంచనపల్లి వద్ద రోడ్డు ఆక్రమణలకు గురికావడం, నూతక్కి నుంచి కుంచనపల్లి 33 కేవీ విద్యుత్ లైన్ల స్తంభాలు అడ్డురావడంతో ఆ రోడ్డు నిర్మాణం కొంతకాలం బ్రేక్ పడింది. ఆర్ అండ్ బీ, మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ అధికారులు సమన్వయంతో రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించేందుకు ప్రయత్నాలు చేసి కొంతమేరకు విజయం సాధించారు. విద్యుత్ స్తంభాలను రోడ్డు నిర్మాణానికి అడ్డులేకుండా పూర్తిగా తొలగించారు. అడ్డంకి లేని దగ్గర రోడ్డు నిర్మించేందుకు అధికారులు ప్రయత్నం చేయడం, అదే సమయంలో ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

ఈ రోడ్డుతో ప్రయోజనం...



గుంతలమయంగా మారిన రోడ్డు

ఈ రోడ్డులో మంగళగిరి నియోజకవర్గంలోని దుగ్గిరాల, మంగళగిరి రూరల్ పరిధిలోని కొన్ని గ్రామాలు, తెనాలి, వేమూరు నియోజకవర్గానికి చెందిన పలు గ్రామాల ప్రజలు విజయవాడ వెళ్లాలంటే ప్రధానంగా ఈ రహదారినే వినియోగిస్తారు. దీంతో పాటు ఆ నియోజకవర్గంలోని వాణిజ్య పంటలు, కూరగాయలు ఇతర పంటలను విజయవాడ మార్కెట్‌కు తరలించాలించేందకు దగ్గర రోడ్డు. ప్రధానంగా ఈ రహదారిలో కేఎల్ యూనివర్శిటీ ఉండడంతో ప్రతిరోజు వేలాదిమంది విద్యార్థులు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలపై ప్రయాణాలు సాగిస్తారు. ప్రయాణించే సమయంలో రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడం, మరికొంత మంది అంగవైకల్యం పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు కానీ, కార్పొరేషన్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ప్రతిరోజు తమ కళ్లముందే ఎంతోమంది ప్రమాదాలకు గురి అవుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై నరకమే..



రేవేంద్రపాడు నుంచి కుంచనపల్లి బ్రిడ్జి వరకు రహదారి పూర్తిగా పాడైపోయింది. 7 కి.మీ. అరగంట సమయం పడుతోంది. ఎదురుగా వాహనాలు వస్తే రోడ్డు మార్జిన్ దింపాలంటే ఎక్కడ అదుపుతప్పి కిందపడతామోనని భయం. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే నేను ప్రతిరోజు విజయవాడ వెళ్లాల్సి వస్తున్నా. ఇక్కడ యూనివర్సిటీ ఉండడంతో ట్రాఫిక్ కూడా అధికంగా ఉంటోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

–గొంగటి వాసు, రేవేంద్రపాడు

ఆటో నడపాలంటే భయమేస్తోంది



ప్రతిరోజు రేవేంద్రపాడు మీదుగా మంగళగిరి–తెనాలి ఆటోలో ప్రయాణిస్తాం. ఈ రోడ్డులో ఆటో నడపాలంటే భయమేస్తోంది. ఉన్న తారురోడ్డు ఒకవైపు ఎత్తుగా మరోవైపు పల్లంగా ఉండడంతో ఆటో చక్రాలు రోడ్డుపై ఆనక నిదానంగా నడపాల్సి వస్తోంది. మా కళ్లముందే కొత్తగా వచ్చిన ఆటోలు బోల్తా కొట్టాయి. తరచూ ఘటనలతో గాయాలపాలవుతున్నారు. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా రోడ్డు వెంటనే నిర్మించాలి.

–కె.రాములు, మెల్లెంపూడి

కళ్లముందే స్నేహితుడు చనిపోయాడు



నా కళ్లముందే నా స్నేహితుడు ఇదో రోడ్డులో బండి అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరి చెయ్యి విరిగింది. ప్రతిరోజు రేవేంద్రపాడు నుంచి వివిధ చేతివృత్తుల చేసుకునే మేము విజయవాడ వెళ్తుంటాం. చనిపోయిన నా స్నేహితుడు కూడా పని నుంచి ఇంటికి వస్తుంటే ప్రమాదం జరిగింది. కుటుంబానికి ఆసరా లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డును నిర్మించాలి

–సిహెచ్.వాసు, రేవేంద్రపాడు

ప్రాణాలు పణంగా పెట్టి ప్రయాణం



గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి కుంచనపల్లి వద్ద శంకుస్థాపన చేశారు. అతి ముఖ్యమైన ఈ రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఏ రోజుకా రోజు ఎదు చేస్తున్నా పనులు జరగట్లేదు . ఈ ప్రభుత్వం అయినా రోడ్డు నిర్మాణం పూర్తి చేసి సామాన్య ప్రజల ప్రాణాలు కాపాడాలి. ఎంతోమంది విద్యార్థులు ఈ రోడ్డులో ప్రయాణిస్తూ గాయాల పాలవుతున్నారు. ప్రమాదాలను నివారించాలంటే వెంటనే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

–హరి సురేష్

లడ్డూ వివాదం సరైంది కాదు

దొంతిరెడ్డి వేమారెడ్డి



తాడేపల్లిరూరల్: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామికి అతి ప్రియమైన ప్రసాదం లడ్డూపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ మంగళగిరి ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఎవరి భావాలూ దెబ్బతినకుండా స్వతంత్ర కమిటీ వేసేందుకు నిర్ణయం తీసుకోవాడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. భారతదేశంతో పాటు ఇతర దేశాల్లో ఎంతోమంది వేంకటేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని చెప్పారు. కోట్లాది మంది భక్తులు ఉన్న వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందని వ్యాఖ్యానించడం, దానిని రాజకీయం చేయవద్దంటూ సుప్రీంకోర్టు చెప్పడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సీబీఐతో పాటు ప్రభుత్వం, ఆలయ సభ్యులు స్వతంత్ర కమిటీగా ఏర్పడి లడ్డూ వ్యవహారంపై సక్రమమైన దర్యాప్తు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరస్వామి ప్రతిష్టకు భంగం కలగకుండా చూడాలని కోరారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తున్న లారీ స్వాధీనం

- ఉద్దండరాయునిపాలెంలో ఘటన
- పొక్లెయిన్‌ని తప్పించిన టీడీపీ నాయకులు

తాడికొండ: తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ డంపింగ్ ప్రాంతంలో ఉన్న ఇసుకను పొక్లెయిన్‌తో లోడింగ్ చేస్తుండగా ఓ కానిస్టేబుల్ వెళ్లి పొక్లెయిన్, లారీని పట్టుకొని స్టేషన్‌కు తరలిస్తుండగా టీడీపీ నాయకుడు జోక్యంతో పొక్లెయిన్ వదిలేశారు. లారీ యజమాని, పొక్లెయిన్‌ను వదిలి తనను ఎందుకు పట్టుకున్నారని ప్రశ్నించగా సదరు కానిస్టేబుల్ దురుసుగా హెచ్చరించినట్లు బాధితుడు వాపోతున్నాడు. అయితే దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు. ఈ తంతు అంతా పోలీస్‌స్టేషన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ కానిస్టేబుల్ నడిపించినట్లు ఆరోపణలున్నాయి.

ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలి

- సీపీఎం నాయకుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

తాడేపల్లిరూరల్: ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. తెలుగు తమ్ముళ్లే ఇసుకను మింగేస్తున్నారని విమర్శించారు. ట్రాక్టర్ ఇసుక ధర వినియోగదారుడు ఇంటికి చేరే సరికి 7 వేల రూపాయలు అవుతోందని, ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవాలని చెప్పిన కూటమి ప్రభుత్వం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఆన్‌లైన్ ఓపెన్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. అరగంటలో ఆన్‌లైన్ విధానం ఆపివేయడం దుర్మార్గమని అన్నారు. తాడేపల్లి మండలంలో నాలుగు ఇసుక రిచ్‌లు ఉన్నాయని కానీ సుమారు రెండు వేల మంది ఇసుక ముఠా కార్మికులు పనులు లేకుండా పోవడానికి యంత్రాలతో ఇసుకను తోడి పోయడమే ప్రధాన కారణమని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తాడేపల్లి తహసీల్దార్ డి. సీతారామయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వరరావు, పట్టణ నాయకులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం తాడేపల్లి పట్టణ నాయకులు నార్ని నాగేశ్వరరావు, వై.బర్నబాస్, తాడేపల్లి రూరల్ నాయకులు పల్లె కృష్ణ, నాగపోగు విజయరాజు, కంచర్ల సాంబశివరావు, తాడేపల్లి పట్టణ నాయకులు బి. గోపిరెడ్డి, బి.యేసయ్య, నీరుడు దుర్గారావు, ఇసుకపల్లి ఇసాక్, శాస్త్రి, రామ తులసమ్మ, మేరమ్మ పాల్గొన్నారు.



దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా దృశ్యం




తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా..

దుగ్గిరాల మండలంలో..

రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజలందరికీ ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. శుక్రవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇసుక సమస్యపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని విస్మరించిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికి భవన నిర్మాణ కార్మికులు పనులులేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం దుగ్గిరాల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జెట్టి బాలరాజు, వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, అద్దంకి పాములు, శేషగిరి, ఏసుదాసు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలుకు డిమాండ్

ఫిరంగిపురం: రాష్ట్రంలో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆ పార్టీ పిలుపుమేరకు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తానని హామీ ఇచ్చి దానిని అమలు చేయలేదన్నారు. ట్రక్కు ఇసుక రూ.7 వేలు నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి మస్తాన్‌వలి

ఘనంగా ప్రారంభమైన సమ్యక్



విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్, స్టాళ్లను పరిశీలిస్తున్న సీడ్ ఏపీ చైర్మన్ దీపక్‌రెడ్డి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జాతీయస్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ సమ్యక్ 2024ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడ్ ఏపీ చైర్మన్ జి. దీపక్‌రెడ్డి హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ, నైపుణ్యాలను తిలకించారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఇది చక్కని అవకాశమని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ యొక్క వికసిత్ భారత్ విజన్ 2047, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యొక్క స్వర్ణ ఆంధ్రప్రదేశ్ విజన్, ఏఐ జెన్ యుగంలో ఊహించలేని అనేక అవకాశాల కోసం మార్గం సుగమం చేస్తాయని అన్నారు. ఏఐ, వీఎల్ ఎస్ఐ, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీస్, హైడ్రో ఫోనిక్స్ మొదలైన అన్ని సాంకేతికతలతో పాటు వారిని ముందుకు తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. సందర్భంగా యూనివర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ కె.రాజశేఖరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సమ్యక్ చైర్మన్లు దీపక్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

తాడికొండ: రాజధాని గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు రెండు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవి, ఎం. భాగ్యరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తుళ్లూరులో సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులపై చిన్నచూపు తగదని, కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న కొంతమంది సూపర్ వైజర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలు గడిచి అక్టోబర్ వచ్చినా జీతాలు చెల్లించకపోతే కార్మికులు ఏం తిని పారిశుధ్యం మెరుగుపరుస్తారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు విచారించి జీతాలు మంజూరు చేయడంతో పాటు కార్మికులను వేదింపులకు గురిచేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com